# సాక్షి
# వికారాబాద్

మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024






## గ్రూపు తగాదాలు!

జీఆర్ఎస్ జిల్లా నేతల్లో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారింది. 8లో▸



## 'పది'లో సత్తా చాటండి

పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునితామహేందర్ రెడ్డి అన్నారు. 8లో▸



## అభివృద్ధికి సహకరించండి

కొడంగల్ పట్టణ అభివృద్ధికి అందరు సహకరించాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. 9లో▸

## న్యూస్‌రీల్

### 'ప్రజావాణి'కి 125 అర్జీలు



వృద్ధుడి సమస్య తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్:ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధింత శాఖల అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 125 మంది సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల గడువు పెంపు

వికారాబాద్ అర్బన్: తెలంగాణ మైనార్టీ రెసిడెన్సియల్ స్కూల్, జూనియర్ కళాశాలల్లో 2024 – 25 విద్యా సంవత్సరానికి గాను 5, 6, 7, 8వ తరగతుల్లో, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల దరఖాస్తు గడువు ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### రేపు వికారాబాద్‌కు ఎమ్మెల్సీ కవిత రాక

తాండూరు టౌన్: తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 7న వికారాబాద్‌కు రానున్నట్లు జాగృతి తాండూరు కన్వీనర్ దత్తాత్రేయ రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటు గురించి వికారాబాద్‌లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె వస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### తిర్మలాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్‌గా కనకం



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఏసీఎస్ పాలకవర్గం సభ్యులు

కుల్కచర్ల: కుల్కచర్ల పీఏసీఎస్ పరిధిలోని తిర్మలాపూర్ డైరెక్టర్‌గా కనకం మొగులయ్యను ఎన్నుకున్నారు. సంఘం డైరెక్టర్‌గా ఉన్న మనోహర్‌రెడ్డి తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ పదవి ఖాళీ అయ్యింది. సోమవారం సీఈఓ బక్కారెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు మొగులయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కొండయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### మెగా డీఎస్సీ వేయాలి



మెగా డీఎస్సీ వేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నిరుద్యోగులు

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించాలని పలువురు నిరుద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్‌లోని తెలంగాణ అమరుల స్థూపం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి 25వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగులకు మేలు చేయాలని వారు కోరారు.

### నాలుగు రైళ్ల రద్దు

అనంతగిరి: ట్రాక్ మెయిన్టనెన్స్‌లో భాగంగా ఈ నెల 5నుంచి 11వ తేదీ వరకు వికారాబాద్ మీదుగా వెళ్లే నాలుగు రైళ్లను ఆ శాఖ అధికారులు రద్దు చేశారు. ఇందులో సికింద్రాబాద్ – చితాపూర్ ఎక్స్‌ప్రెస్, వాడి – ఫలక్‌నుమా, సికింద్రాబాద్ – వికారాబాద్, గుంటూరు – వికారాబాద్ రైళ్లను రద్దు చేశారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని అధికారులు కోరారు.

# అక్రమాలకు చెక్

**ఎరువుల కృత్రిమ కొరతను అరికట్టేందుకు 'ఎఫ్ఐవీ'**

- యాప్‌లో స్టాక్ ఫొటోల అప్‌లోడ్
- అక్రమాలకు పాల్పడినట్లు తేలితే ఫెర్టిలైజర్ షాపు లైసెన్సు రద్దు
- నెలలో ఐదు రోజులు తనిఖీలు చేయనున్న వ్యవసాయశాఖ అధికారులు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

వికారాబాద్ అర్బన్: డీలర్ల వద్ద ఎరువులు ఉన్నా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఇలా కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారుల ఆట కట్టించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఫెర్టిలైజర్ షాపుల్లో ఏ రోజు ఎంత మేర ఎరువుల నిల్వలు ఉన్నాయనే వివరాలను తెలుసుకునేందుకు వ్యవశాయశాఖ ఎఫ్ఐవీ (ఫెర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్) యాప్‌ను తీసుకొచ్చింది. జనవరి మొదటి వారం నుంచి ఈ యాప్ అమల్లోకి వచ్చిందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఎరువుల దుకాణాల్లో కృత్రిమ కొరతను నివారించే ఉద్దేశంతో ప్రభుత్వం వారంలో రెండు రోజులు (సోమ,గురువారం)దుఖాణాల్లో తనిఖీలు చేయాలని ఆదేశించింది. తద్వారా ఎరువుల కొరతకు కారణాలేంటనే దానిపై పరిశీలించి, క్షేత్రస్థాయిలో లోపాలను గుర్తించి మరింత పారదర్శకంగా వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. ప్రత్యేక యాప్‌తో జిల్లాలోని 359 ఎరువుల దుకాణాలను పరిశీలించి అక్రమ నిల్వలపై, కృత్రిమ కొరతపై చర్యలు తీసుకోనున్నారు. సంబంధిత డీలర్లు ఎరువుల అమ్మకాలు, కొనుగోళ్లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయకుండా లెక్క తప్పితే వ్యవసాయ శాఖ అధికారులు ముందుగా దుఖాణ యజమానికి నోటీసులిస్తారు. అధికారుల తనిఖీల్లో పొరపాట్లు జరిగినట్లు తేలితే వెంటనే షాపు లైసెన్సు రద్దు చేసేలా ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. మిషన్ రిపేర్ లాంటి సమస్యలు వచ్చినప్పుడు సంంధిత అధికారులకు సమాచారం ఇచ్చి రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

**అప్‌లోడ్ తప్పనిసరి**

వారంలో రెండు సార్లు వ్యవసాయ శాఖ అధికారులు ఫెర్టిలైజర్ షాపుల్లో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించి వాటిని ఎఫ్ఐవీ యాప్‌లో నమోదు చేస్తారు. ఆయా షాపుల్లోని ఎరువుల బస్తాల వద్ద ఫొటోలు దిగి, స్టాక్ రిజిస్టర్‌లో సంతకం చేయడంతో పాటు, ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గతంలోనే వ్యవసాయ శాఖ ఎరువుల డీలర్ల షాపులకు జీపీఎస్ ద్వారా ట్యాగ్ చేశారు. ఈ విధానం అందుబాటులో ఉండడంతో తనిఖీ చేసిన అధికారులు షాపు వద్ద ఉండి గూగుల్ ద్వారా ఫొటో దిగి లొకేషన్‌ను పంపించాల్సి ఉంటుంది. ఏఓ, ఏడీఏ, జేడీఏ స్థాయి అధికారులు నెలలో ఐదుసార్లు దుకాణాలు తనిఖీ చేయాలనే నిబంధన ఉంది. డీలర్లు పీఓఎస్ యంత్రాలను ఉపయోగిస్తున్నారా.. లేదా, ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం నిర్వహణ ఉందో లేదో తెలియజేయాల్సి ఉంటుంది. జిల్లాలో ఎరువుల అమ్మకాల, కొనుగోలు తీరును జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు.

**పారదర్శకత**

రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుక్చొంది. డీలర్లు ఎరువులను పక్కదారి పట్టించకుండా ఎప్పటికప్పుడు నిఘా ఉంటుంది. ఈ విధానం అమల్లోకి రావడంతో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పనితీరు కూడా మెరుగు పడుతుందని అభిప్రాయపడుతున్నారు. జీపీఎస్ విధానం అమల్లో రావడంతో ఎరువుల నిల్వలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**తనిఖీలు ముమ్మరం**



జిల్లాలోని ఎరువుల షాపుల్లో స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఎఫ్ఐవీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. వ్యవసాయ శాఖ అధికారులు వారి పరిధిలోని ఐదు షాపులను వారంలో రెండు సార్లు తప్పకుండా తనిఖీ చేయాలి. ఈ విధానం అమలుతో అధికారులకు బాధ్యత పెరగడంతో పాటు, అక్రమాలకు, కృత్రిమ కొరతకు తావుండదు. ఎరువుల అమ్మకంలో పారదర్శకత ఉంటుంది. ఏఓ నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు తనిఖీ చేయాల్సి ఉంటుంది.

– గోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి



కలెక్టర్‌కు గ్రంథాన్ని అందజేస్తున్న డాక్టర్ చెన్నయ్య, అవధాని అంజయ్య

# భాషాసాహిత్య రంగాలను ప్రోత్సహిస్తాం

**కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్ అర్బన్: జిల్లాలో భాషాసాహిత్య రంగాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామ ని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రచురించిన జిల్లా సమగ్ర స్వరూపం అనే గ్రంథాన్ని ఈ పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సోమవారం కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అత్యంత క్రియాశీలంగా సాగుతున్నామని, ఇకపై భాషా సాహిత్యాలకు కూడా తగిన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం జిల్లా అన్ని రంగాల్లో ముందుందని తెలిపారు. ఈ అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్ ప్రచురించిన గ్రంథాన్ని అందరికీ అందేలా చూస్తామని అన్నారు. ప్రతి ఒక్కరూ జిల్లా గొప్పతనం గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ చెన్నయ్య మాట్లాడుతూ.. 80 ఏళ్ల క్రితం ఏర్పడిన సారస్వత పరిషత్ తెలుగు భాష పరిరక్షణకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాషాసాహిత్యాలు, కళలు మొదలైన అంశాలపై సమగ్ర గ్రంథాలను రూపొందిస్తుందని, ఇప్పటి వరకు 16 జిల్లాలకు సంబంధించిన వివరాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అష్టావధాని అంజయ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యాదయ్యకు సబితారెడ్డి పరామర్శ

చేవెళ్ల: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి సోమవా రం పరామర్శించారు. ఆమె తనయుడు పి.కార్తీక్‌రెడ్డితో కలిసి వెళ్లారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.





జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు చేసిన పత్తి

# మద్దతు ధరే దిక్కాయే..!

- అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి తగ్గిన డిమాండ్
- గత ఏడాది బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ. 9వేల పైనే..
- ఈ సారి రూ. 7వేలు దాటని వైనం
- విధిలేక సీసీఐ కేంద్రాల్లో విక్రయించిన రైతులు

తాండూరు: పత్తి రైతులకు ప్రభుత్వ మద్దతు ధరే దిక్కయ్యింది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలు పత్తికి రూ.6,920 చెల్లిస్తున్నారు. అయితే గత ఏడాది బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు రూ. 9వేలకు పైగా అమ్ముడుపోయింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ లేకపోవడంతో ధర పడిపోయింది. దీంతో కొనేవారు లేక రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 33,571 మంది రైతులు 78,370.57 మెట్రిక్ టన్నుల పత్తిని విక్రయించారు.

**2.51లక్షల ఎకరాల్లో పంట సాగు**

జిల్లాలో ప్రధాన పంటగా పత్తి సాగవుతోంది. 20 మండలాల్లో 2.51 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. గతేడాది క్వింటాలు పత్తికి ప్రభుత్వం రూ.7,020 మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసింది. అయితే బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ. 9వేలకు పైగా ఉండటంతో ప్రైవేటు వ్యక్తులకే విక్రయించారు. ఈ ఏడాది ప్రభుత్వ మద్దతు ధర రూ. 6,920 కాగా బహిరంగ మార్కెట్‌లో ఈ ధర కూడా లేకపోవడంతో రైతులు సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించారు. ఇప్పటి వరకు సేకరించిన 78,370.57 మెట్రిక్ టన్నులు పత్తికి రూ.543.89 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.496.39 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగతా డబ్బులు మరో వారంలోపు ఖాతాల్లో జమ కానున్నట్లు తెలిసింది.

**నష్టపోతున్న రైతులు**

పత్తి పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో ధర పడిపోయింది. దీంతో రైతులు నష్టపోతున్నారు. గత ఏడాదితో పోలిస్తే క్వింటాలుకు రూ. రెండు వేల వరకు తగ్గింది. ఏడాది కష్టం చేస్తే క్వింటాలుకు వెయ్యి రూపాయలు కూడా మిగలదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటిది ఏకంగా రూ. రెండు వేలు తగ్గితే నష్టపోవాల్సి ఉంటుందని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేయడంలేదని రైతులు తెలిపారు. దీంతో ప్రభుత్వ మద్దతు ధరకే విక్రయిస్తున్నట్లు వారు తెలిపారు.

# మున్సిపల్ సిబ్బంది వేతనాలు పెంచండి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్

ఇబ్రహీంపట్నం రూరల్: కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పని చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ..తెలంగాణ వ్యాప్తంగా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వేల మంది కార్మికులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్‌పే తదితర పద్ధతుల్లో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. పనికి భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, నాయకులు ఈ.నర్సింహ, టి.నర్సింహ, ఎం.సత్యనారాయణ, హంసమ్మ, సుభాష్, రవి, సురేందర్, రాజు, మేతరి దాసు, మైసయ్య, రవికుమార్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

**మా ఇళ్లు మాకు ఇప్పించండి**

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం తమకు కేటాయించిన ఇళ్లను ఇతరులు కబ్జా చేశారని.. వారిని తక్షణమే అక్కడి నుంచి ఖాళీ చేయించాలని కోరుతూ పలువురు బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. నిలువ నీడలేని నిరుపేదలకు ప్రభుత్వం 2018లో జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే పథకం కింద పక్కా ఇళ్లను మంజూరు చేసిందని.. కర్మన్‌ఘాట్ నందనవనం ఫేజ్–3లో 512 మందికి ఇళ్లను కేటాయించిందని తెలిపారు. తమకు కేటాయించిన ఇళ్లలో ఇతరులు అక్రమంగా చొరబడి ఆక్రమించుకున్నారని, అదేమని ప్రశ్నిస్తే భౌతిక దాడులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఇళ్లను కబ్జా చేసిన వారికి 2013లోనే ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందని, వారు వాటిని అమ్ముకున్నారని ఆరోపించారు. రాత్రికి రాత్రే తలుపులు, తాళాలు పగలగొట్టి తమకు కేటాయించిన వాటిని కబ్జా చేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ శశాంక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రాథోడ్, రాజ్‌కుమార్, మోహన్, రాజు, మోతిలాల్, పద్మ, సీత, ఆస్మబేగం, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# టీబీకి టాటా

- క్షయ కట్టడికి జిల్లా అధికారుల కృషి
- బాధితులను గుర్తిస్తూ చికిత్సలు
- టీబీ అలర్ట్ ఇండియా సహకారంతో జీత్ 2.0ప్రాజెక్టు ఆధ్వర్యంలో మందుల పంపిణీ

కొడంగల్ రూరల్: క్షయ వ్యాధి కట్టడికి జిల్లా అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ఎప్పటికప్పుడు బాధితులను గుర్తిస్తూ వైద్యసిబ్బంది సాయంతో మందులను పంపిణీ చేయడంతో క్షయ వ్యాధి కట్టడిలో ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఓ వైపు వ్యాధి నివారణకు విస్తృతంగా వైద్య సేవలు నిర్వహిస్తూ మరోవైపు క్షేత్రస్థాయిలో వ్యాధి, చికిత్స విధానంపై అవగాహన కల్పిస్తూ కొత్త కేసులు నమోదు కాకుండా చూస్తున్నారు.

**సరైన చికిత్స తప్పనిసరి**

టీబీ(ట్యూబరుక్యులోసిస్)గా వ్యవహరించే క్షయ వ్యాధికి సరైన చికిత్స తీసుకోకుంటే ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్లే అవుతుంది. ఇది వ్యక్తి బలహీనం చేస్తుంది. ఇది అంటు వ్యాధి అవ్వడంతో ప్రజలు ఆందోళనకు గురవుతుంటారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి సులువుగా సోకుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆశ, ఏఎన్ఎంలు వ్యాధిగ్రస్తులకు క్రమం తప్పకుండా మందులను అందిస్తూ వ్యాధి నివారణకు కృషి చేస్తున్నారు.

**ఆరు నెలల కోర్సు తప్పనిసరి**

క్షయ వ్యాధి నిర్మూలన జిల్లా అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్ ఆధ్వర్యంలో టీబీ అలర్ట్ – ఇండియా అనే సంస్థ సహకారంతో జీత్ 2.0 ప్రాజక్టుతో సిబ్బంది మందులను అందిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో నమోదైన ఛాతి సంబంధిత టీబీ రోగుల ఇంటిని సందర్శిస్తూ వారితో కలిసి నివసించే వారి వివరాలు సేకరించి సంబంధిత డాక్టర్ ఆధ్వర్యంలో కుటుంబసభ్యులందరికి టీబీ నివారణ మందులను అందిస్తున్నారు. ఆరు నెలల కోర్సుతో టీబీ అలర్ట్ ఇండియా సిబ్బంది క్షేత్ర స్థాయిలో వ్యాధి సోకిన వ్యక్తుల కుటుంబసభ్యులకు మందులు పంపిణీ చేస్తున్నారు. వ్యాధి బారిన పడిన వారికి చికిత్స అందించడంతోపాటు వారి కుటుంబసభ్యులు టీబీ నివారణ మందులు వాడడంతో వ్యాధి నివారణ సాధ్యమవుతుందని వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు.

**గుర్తింపు ఇలా..**

రెండువారాలకు మించి ఎడతెరిపి లేకుండా దగ్గు, సాయంత్రం జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, దగ్గిన సమయంలో రక్తం పడడం టీబీ లక్షణాలు. సమీపంలోని ఆస్పత్రికి వెళ్తే ఉచితంగా తెమడ పరీక్షలు చేసి వ్యాధిని గుర్తిస్తారు. క్షయ అంటువ్యాధి, ట్యూబరుక్యులోసిస్ బ్యాక్టీరియా అధికంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. పొగరాయుళ్లు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బలహీనంగా ఉన్నప్పుడు ప్రబలుతుంది.

- జిల్లాలోని జనాభా ప్రాతిపదికన మొత్తం 19,200 మందికి పరీక్షలు నిర్వహించాల్సిన టార్గెట్ ఉండగా జిల్లాలో 22,182మందికి పరీక్షలు నిర్వహించినట్లు, ఇందులో 1930 మందికి చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు.



క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రొటీన్ ఫుడ్ అందజేస్తున్న డాక్టర్ రవీంద్రయాదవ్(ఫైల్)

**కుటుంబసభ్యులు సహకరించాలి**



టీబీ సోకిన వ్యాధిగ్రస్తుల కుటుంబసభ్యులు టీబీ అలర్ట్ ఇండియా జీత్ 2.0ప్రాజక్టు సిబ్బంది అందించే మందులను ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వాడాలి. నిర్లక్ష్యం చేస్తే ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉంటుంది. వ్యాధిగ్రస్తులతో పాటు కుటుంబసభ్యులు సైతం మందులు వాడడంవల్ల వ్యాధి నిర్మూలన సాధ్యమవుతోంది.

– సత్యప్రసాద్, జీత్ 2.0 ప్రాజెక్టు జిల్లా లీడ్

**అన్ని పీహెచ్‌సీల్లో పరీక్షలు**



క్షయ సోకిన ఇంట్లో ప్రతి ఒక్కరికీ ముందు జాగ్రత్తలో భాగంగా మందులు ఇస్తున్నాం. రెండు వారాల పాటు దగ్గు, జ్వరం, బరువు తగ్గుతున్నట్లు అనిపిస్తే తెమడ పరీక్ష చేయించుకోవాలి. వ్యాధిగ్రస్తులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు. అన్ని పీహెచ్‌సీలలో ఉచితంగా పరీక్షలు చేస్తారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుంది.

– డాక్టర్ రవీంద్రయాదవ్, క్షయ నియంత్రణ జిల్లా అధికారి

# విద్యార్థుల మృతిపై స్పందించరేం?

**చేవెళ్లలో ఏబీవీపీ నాయకుల నిరసన**

చేవెళ్ల: రోడ్డు మీద ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను తొలగిస్తే స్పందించిన నాయకులు, పాలకులు విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలపై స్పందించకపోవడం దారుణమని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కల్లెం సూర్యప్రకాశ్ అన్నారు. భువనగిరిలో ఇద్దరు విద్యార్థుల మృతికి కారణమైన వారిని గుర్తించి, వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. నాణ్యమైన విద్య, ఉచిత భోజనం అందుతుందనే ఆశతో ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులు శవాలుగా బయటకు రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మహిపాల్, నాయకులు కిషోర్, విజయ్‌ః, ప్రవీన్, తరుణ్, శివకుమార్, విద్యార్థులు ఉన్నారు.



చేవెళ్లలో ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

## క్లుప్తంగా

### ఇసుక ట్రాక్టర్లు సీజ్



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

తాండూరు టౌన్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. బషీర్‌మియా తండాకు చెందిన డ్రైవర్లు శ్రీకాంత్, వార్త్య సోమానాయక్ రెండు ట్రాక్టర్లలో ఖాంజాపూర్ సమీపంలోని కాగ్నానది నుంచి అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. దీంతో ఆ ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా కాగ్నానది నుంచి ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

### ఇద్దరికి 'కళారత్న'



అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందుకుంటున్న పెంటయ్య

అనంతగిరి: బహుజన సాహిత్య అకాడమి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అందించే బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు వికారాబాద్‌కు చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. వాల్మీకి మేతర్ సమాజ్ జాగృతి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మయూర్, ప్రముఖ కళాకారుడు టేకు పెంటయ్య కళారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అవార్డు ఆహ్వాన పత్రాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 11న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో అవార్డు అందజేస్తామన్నారు. అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

### స్కూటీని ఢీకొట్టిన టిప్పర్

మహిళ దుర్మరణం

మీర్‌పేట: టిప్పర్ వెనుక చక్రాల కింద నలిగి మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దుర్ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ మండల మద్దిగట్ల గ్రామానికి చెందిన దుపల్లి లక్ష్మి(52) భర్త చనిపోయాడు. కొంతకాలంగా ఆమె చంపాపేట సిద్దార్థ స్కూల్ సమీపంలో తన కూతురు, కుమారుడితో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తూ కూలీ పని చేసుకుంటోంది. హస్తినాపురం డీఆర్‌డీఎల్ కాలనీలో నివాసముండే బంధువుల వద్దకు వెళ్లేందుకు మధ్యాహ్నం తెలిసిన వారి స్కూటీపై వెళ్తున్నారు. ఈ క్రమంలో హస్తినాపురం జెడ్పీ రోడ్డులోని అగ్రికల్చర్ కాలనీ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ముగ్గురు కిందపడగా, లక్ష్మి టిప్పర్ వెనక చక్రాల కిందపడి తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలిలోనే మృతి చెందింది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

# 'గులాబీ'లో గ్రూపు తగాదాలు!

- నేతల మధ్య కొనసాగుతున్న అంతర్గత విభేదాలు
- పార్టీ నష్టపోతున్నా పట్టించుకోని వైనం
- పరిస్థితిలో మార్పు రాకపోతే ఎంపీ అభ్యర్థికి చిక్కులే



వికారాబాద్: బీఆర్‌ఎస్‌లో జిల్లా నేతల్లో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు అధిష్టానానికి తలనొప్పిగా మారాయి. ఇటీవల వికారాబాద్, పరిగి నియోజకవర్గాల్లో నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాల్లో నేతల మధ్య కుమ్ములాటలు మరోసారి బయటపడ్డాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పార్టీ ప్రధాన కార్యదర్శి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలోనే పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. సీనియర్లతోపాటు కార్యకర్తలను విస్మరించడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవిచూడాల్సి వచ్చిందని పలువురు నాయకులు ముఖ్య నేతల ముందే అసంతృప్తి వెళ్లగక్కారు. వికారాబాద్‌లో పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడిని స్టేజీపైనుంచి పంపేయడం కలకలం రేపింది. అవమానానికి గురైన ఆయన సొంత పార్టీ నాయకులపైనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో లీడర్ల మధ్య సఖ్యత లేదనేది రుజువైంది. సమావేశాలు, పార్టీ కార్యక్రమాలు జరిగినప్పుడు జిల్లా, నియోజకవర్గ స్థాయి నేతలకు కూడా సమాచారం ఇవ్వడం లేదని కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.

**రెండేళ్ల క్రితం మొదలై..**

రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్ జిల్లా నాయకుల్లో మొదలైన అంతర్గత కుమ్ములాటలు నేటికీ సద్దుమణగ లేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి తీరని నష్టం జరిగినా నేతల్లో మార్పు కనిపించడం లేదనే అపవాదు ఉంది. అభివృద్ధి, సంక్షేమంలో తమకు సాటిలేదని గులాబీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నా.. జిల్లాలో ఒక్క అభ్యర్థి గెలవలేకపోయారు. కొడంగల్‌లో 32,720, పరిగిలో 23,955, వికారాబాద్‌లో 12,672, తాండూరులో 6,583 ఓట్ల తేడాతో ఓటమిని చవిచూశారు. అయినా దిద్దుబాటు చర్యలు చేపట్టడంలేదు.

**సునీతారెడ్డి దూరం**

ఇటీవల పరిగి, వికారాబాద్‌లో నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి హాజరు కాలేదు. ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి పరిగి సమావేశానికి హాజరవగా వికారాబాద్ మీటింగ్‌కు రాలేదు. ఈ పరిణామాలన్నీ త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి తలనొప్పిగా మారే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



ఆర్థికసాయం అందజేస్తున్న చంద్రకుమార్ తదితరులు

హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

పరిగి: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి, తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపకుడు జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఈ నెల 1న మండల పరిధిలోని నజీరాబాద్(హన్మన్‌గండి తండా)తండాకు చెందిన రైతు హరిశ్చందర్(45) అప్పుల బాధతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న చంద్రకుమార్ సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అప్పుల బాధతో ఏ ఒక్క రైతు ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించి రైతులు ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి ప్రభుత్వం అందించే సాయం రూ.10లక్షలకు పెంచాలని కోరారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం లేదా రెండు ఎకరాల పొలం అందివ్వాలని డిమాండ్ చేశారు. తమ సంఘం రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. రైతులకు సమస్యలుంటే సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఇంద్రసేన, సమితి నాయకులు లింగ్యానాయక్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# 'పది'లో సత్తా చాటండి

జెడ్పీ చైర్‌పర్సన్ సునితామహేందర్



విద్యార్థినితో పుస్తక పఠనం చేయిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీత

కుల్కచర్ల: పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునితామహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కులకచర్ల మండల పర్యటనలో భాగంగా బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి 10వ తరగతిలోకి వెళ్ళి విద్యార్థులను పాఠ్యాంశాలు చదివించారు. ఈ సందర్భంగా పాఠ్య బోధన ఏవిధంగా సాగుతుంది, సిలబస్ పూర్తయిందా లేదా.. ఇంకేమైన సమస్యలన్నాయా అని తెలుసుకున్నారు. దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పాఠశాలకు గొప్ప పేరు తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజశేఖర్ గౌడ్, ఎంపీడీఓ నాగవేణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెంటయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బావిలో పడి వ్యక్తి మృతి



వెంకటయ్య మృతదేహం

దోమ: ప్రమాదవశాత్తు వ్యక్తి బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన దోమ ఠాణా పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపిన ప్రకారం మండల పరిధిలోని కొండాయపల్లికి చెందిన ఉడుము వెంకటయ్య(27) పొలానికి వెళ్లాడు. కాలు జారడంతో పొలంలో పడిపోయాడు. బురదను శుభ్రం చేసుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు బావిలో దిగి గాలించి వెంకటయ్యను బయటకు తీశారు. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పరిగి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్య పద్మ, మూడేళ్ల కుమారుడున్నాడు. మృతుడి తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యుదాఘాతంతో రైతు మృతి

కౌలు రైతుపై కేసు



రాములు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తాండూరు రూరల్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఉద్దండాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గువ్వలి రాములు(57) కొడుకు నరేశ్‌తో కలిసి పంట పరిశీలనకు వెళ్లాడు. పక్క పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రాంశెట్టి జొన్న పంట రక్షణకు పొలం చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. పంట పరిశీలనకు వెళ్లిన రాముకు ఎడమ కాలికి ఫెన్సింగ్ వైర్ తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకు నరేశ్ అప్రమత్తమై పొలంలోకి వెవెళ్లకుండా వెనక్కి తగ్గాడు. ఇదే విషయం కొడుకు స్థానికులకు చెప్పడంతో వారు వచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సావిత్రి, ముగ్గురు కుతూళ్లు, ఒక కుమారుడు సంతానం. నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా జొన్న పంటకు విద్యుత్ ఫెన్సింగ్ వేసిన రాంశెట్టి పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# ఇద్దరు నిందితులకు రిమాండ్



కొందుర్గు: లాల్‌పహాడ్ చౌరస్తాలో గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు

శంకర్‌పల్లి: గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని శంకర్‌పల్లి ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలోని పర్భాని జిల్లా గంగాకేగ్ గ్రామానికి చెందిన శ్యామ్‌వైద్యనాథ్ గైక్వాడ్, కొస భాయ్ సోగేవాడు మరో ఇద్దరితో కలిసి విశాఖపట్నం నుంచి శంకర్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు 31కిలోల 300 గ్రాముల గంజాయిని తరలిస్తున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారంతో దాడులు చేశారు. సోమవారం శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తా వద్ద తనిఖీలు నిర్వహించి గంజాయిని సీజ్ చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారని ఎస్సై తెలిపారు. కాగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు వివరించారు.

**440గ్రాముల గంజాయి లభ్యం**

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ చౌరస్తాలో ఓ యువకుడి వద్ద 440 గ్రాముల గంజాయి లభించినట్లు ఎస్‌ఐ సక్రమ్ తెలిపారు. వివరాల ప్రకారం ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో లాల్‌పహాడ్ చౌరస్తాలో అనుమానస్పదంగా కనిపించిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా 440 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయిని సీజ్ చేసి నిందితుడి వద్ద సెల్‌ఫోన్, రూ.500నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మధ్యప్రదేశ్ రాష్ట్రం, రీవా జిల్లా, షాయిపూర్ మండలం, దేవరా గ్రామానికి చెందిన వికాస్ పటేల్(19) గా గుర్తించారు. కొంతకాలంగా వనంపల్లి శివారులోని జీబీ బేకర్స్‌లో పనిచేస్తున్నారు. నిందితుడిని సోమవారం కోర్టులో హజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సక్రమ్ తెలిపారు.

### కడుపు నొప్పి భరించలేక..

రైతు బలవన్మరణం

చేవెళ్ల: కడుపునొప్పి భరించలేక ఓ రైతు ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని జాలగూడలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని అల్లవాడ అనుబంధ గ్రామం జాలగూడకు చెందిన ఖానాపురం సత్యనారాయణ రెడ్డి(48) వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం పనులకు వెళ్లకుండా ఇంటివద్దే ఉన్నాడు. ఇది గమనించిన వరసకు పిన్ని అయిన కాంతమ్మ ఏమైందని ప్రశ్నించగా.. కడుపునొప్పిగా ఉందని చెప్పా డు. అనంతరం బాధ భరించలేక ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని స్థానికుల సాయంతో చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# బాల్క సుమన్‌పై ఫిర్యాదు



ఎస్‌ఐ భరత్‌రెడ్డికి ఫిర్యాదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచితవ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము ఆధ్వర్యంలో పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ భరత్‌రెడ్డికి ఫిర్యాదు అందించారు. స్థాయికి మించి మాట్లాడడం.. అనుచిత వ్యాఖ్యలతో దుర్భాషలాడిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ప్రాణం తీసిన నిర్లక్ష్యం

- ఓవర్‌లోడ్, అతివేగంతో అదుపు తప్పిన ఆటో
- వృద్ధుడి మృతి, పలువురికి గాయాలు

మొయినాబాద్: అతివేగంగా వెళ్తున్న ఆటో బోల్తా పడిన సంఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందగా పలువురు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం కేతిరెడ్డిపల్లి గేటు సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. కేతిరెడ్డిపల్లికి చెందిన అనిమోని కిష్టయ్య(70) సాయంత్రం 5 గంటల సమయంలో మొయినాబాద్ వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. అప్పటికే ఆటోలో మరో పది మంది మహిళలు ఉన్నారు. గ్రామం నుంచి మొయినాబాద్‌కు బయలుదేరిన వాహనం అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పి బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న కిష్టయ్యకు తీవ్రంగా గాయపడగా.. ఆయన కూతురు సంతోష స్వల్పంగా గాయపడింది. ఓ యువతికి కాలు విరగగా, మరో ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కిష్టయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి, కిష్టయ్య మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### విద్యార్థుల మృతిపై స్పందించరేమి?

చేవెళ్లలో ఏబీవీపీ నాయకుల నిరసన

చేవెళ్ల: రోడ్డు మీద ఏర్పాటు చేసిన ఫుడ్ స్టా ల్‌ను తొలగిస్తే స్పందించిన నాయకులు, పాలకులు విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలపై స్పందించకపోవడం దా రుణమని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కల్లెం సూర్యప్రకాశ్ అన్నారు. భువనగిరిలో ఇద్దరు విద్యార్థుల మృతికి కారణమైన వారిని గుర్తించి, వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. నాణ్యమైన విద్య, ఉచిత భోజనం అందుతుందనే ఆశతో ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న పే ద విద్యార్థులు శవాలుగా బయటకు రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. నగర కార్యదర్శి మహిపాల్, నాయకులున్నారు.

# విద్యుత్ కనెక్షన్ కట్ చేశారని..

మనస్తాపంతో రైతు ఆత్మహత్యాయత్నం



రైతును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొందుర్గు: తన వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ కట్ చేశారనే మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన తంగెళ్లపల్లిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెరుమాల్‌రెడ్డికి మూడెకరాల భూమి ఉంది. వ్యవసాయం కోసం ఇటీవల కొత్తగా బోరు వేయించాడు. విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ చెల్లించి, అనుమతులు పొందాడు. ట్రాన్స్‌కో అధికారులు పెరుమాల్‌రెడ్డి బోరుకు కనెక్షన్ ఇచ్చారు. అయితే గ్రామానికి చెందిన మరికొందరు రైతులు ఆక్షేపణ తెలపడంతో అధికారులు తిరిగి కనెక్షన్ తొలగించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతన్ని శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా పెరుమాల్‌రెడ్డి డీడీ చెల్లించింది, విద్యుత్ కనెక్షన్ తీసుకున్నదీ వాస్తవమేనని తెలిపారు. సదరు ట్రాన్స్‌ఫార్మర్‌పై సామర్థ్యానికి మించి కనెక్షన్లు ఉండటంతో.. ఓవర్ లోడ్ కారణంగా అంతకు ముందే కనెక్షన్లు ఉన్న రైతుల బోరు మోటర్లు నడవడం లేదని, దీంతో కొత్త కనెక్షన్‌ను తొలగించారని చెప్పారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.



# నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: నులిపురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. ఫిబ్రవరి 12న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఎంపీడీఓలు, ఎంఈఓలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది చిన్నారుల తల్లిదండ్రులకు నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. డివిజన్‌లో ఏడాది నుంచి 19 ఏళ్ల చి న్నారులు మొత్తం 85,776 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్ల పిల్లలకు సగం టా బ్లెట్, మూడు నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఒక టాబ్లెట్ వేయాలని సూచించారు. ఈ మాత్రలను పిల్లలు భోజనం చేసిన తర్వాత మింగించాలని సూచించారు. అదేవిధంగా ఫిబ్రవరి 13 నుంచి 18 వరకు తొ మ్మిది నెలల చిన్నారుల నుంచి ఐదేళ్ల పిల్లలకు వి టమిన్ ఏ సొల్యూషన్ వేయాలని సూచించారు. చి న్నారుల ఆరోగ్య సంరక్షణ పై తల్లిదండ్రులు, వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలకే ప్రమాదమని అన్నారు. ఈ సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ శంకర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

### చాక్లెట్ ఆశచూపి.. అఘాయిత్యం

షాద్‌నగర్ రూరల్: నాలుగేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశచూపి అఘాయిత్యానికి పాల్పడిన వృద్ధుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటన పట్టణంలోని అయ్యప్ప కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ ప్రతాప్‌లింగం తెలిపిన ప్రకారం.. అయ్యప్ప కాలనీలో ఓ నిరుపేద కుటుంబం అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. రోజు మాదిరిగానే చిన్నారి తండ్రి పనికి వెళ్లగా.. బాలికను అమ్మమ్మ వద్ద ఉంచి తల్లి ఇళ్లలో పనిచేసేందుకు వెళ్లింది. ఆ చిన్నారి ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చింది. అదే కాలనీలో నివాసం ఉంటున్న పెంటయ్య(66) పసిపాపకు చాక్లెట్ ఇస్తానని ఎత్తుకుని ఇంట్లోకి తీసుకుని వెళ్లాడు. తనపై కూర్చో పెట్టుకుని అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఇదే విషయం బాలిక తల్లితో చెప్పింది. దీంతో విషయం తెలుసుకున్న కాలనీ వాసులు పెంటయ్యకుదేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### వివాహిత ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం చెదురుపల్లి గ్రామానికి చెందిన సువర్ణ అలియాస్ స్వప్న (26)కు మండల పరిధిలోని చింతగూడ గ్రామానికి చెందిన వ్యక్తితో కొన్నేళ్ల కిత్రం వివాహమైంది. సువర్ణ తండ్రి కృష్ణయ్య హైదరాబాద్‌లోని నందిహిల్స్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. సువర్ణ భర్తను వదిలి తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడకు చెందిన గణేశ్ నందిహిల్స్ సమీపంలో ఓ వ్యక్తి వద్ద పనిచేస్తున్నాడు. గణేశ్, సువర్ణల పరిచయం పెళ్లిదాకా వెళ్లింది. దీంతో ఐదేళ్ల కిత్రం వీరు యాదగిరిగుట్టలో రెండో వివాహం చేసుకున్నారు. అనంతరం వారు ఆరు నెలల క్రితం పని నిమిత్తం షాద్‌నగర్‌కు వలస వచ్చారు. భర్త ఇంట్లో లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.